ప్రచార హోరు

- గెలుపుపై మూడు పార్టీల ధీమా
- ముఖ్య నేతలతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల సమావేశాలు

నిజాంపేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డితో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో మల్కాజిగిరి అభ్యర్థిగా తనను గెలిపించాలని సునీతా మహేందర్ రెడ్డి ప్రజలను కోరారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమ స్యలు పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో భాగంగా డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డితో పాటు ఎమ్.శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, వర్మ రాజు, మధుసూధన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

● కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

పేట్‌బషీరాబాద్: మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎంతో అభిమానం అని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లోని టీఎస్ఆర్ నార్త్ సిటీ రెసిడెన్సీ భీమా ప్రైడ్ గ్రేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో ఆమె ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కలిసి సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరిలో మరో సారి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జోత్స్నారెడ్డి, ఆర్ లక్ష్మి, బండి శ్రావణ్‌గౌడ్, బండి శ్రీనివాస్ గౌడ్, బేక్ శ్రీనివాస్, పూర్ణ చందర్, అనూప్, నికాంత్, కిరణ్‌కుమార్, భీమా ప్రైడ్ రెసిడెన్సీ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సచిన్‌రావు, బాలాజీ పాల్గొన్నారు.


నిజాంపేట ప్రచారంలో మాట్లాడుతున్న సునీతామహేందర్‌రెడ్డి

'రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం'

చందానగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ అన్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన వడ్డెర సామాజిక వర్గ నాయకులతో చందానగర్‌లో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్డెర సామాజికవర్గ సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమైందన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కార్యక్రమంలో లింగయ్య, సత్యనారాయణరాజు, అనంతయ్య, కృష్ణయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి అండగా నిలవాలి: అనితారెడ్డి

హైదర్‌నగర్: దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీకి అందరూ అండగా నిలవాలని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సోదరి అనితారెడ్డి అన్నారు. ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, మరోసారి మోదీ ప్రధాని అయ్యేలా కృషి చేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో విశ్వేశ్వరరెడ్డిని గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. మనిభూషణ్, అశోక్, నరేష్, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

వివేకానందనగర్‌కాలనీ: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో సప్తగిరికాలనీలోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్పొరేటర్ల సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. చేవెళ్లలో గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈనెల 13న చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. అనంతరం కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు సేవలందించే అవకాశం కల్పించాలని కోరారు. కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మాధవరం రంగారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

'బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అగ్రగామిగా నిలిచింది'

అల్లాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారంలో ఉండగా వేల కోట్ల అభివృద్ధి పనులతో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టిన ఘనత బీఆర్ఎస్‌దేనని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలంటూ అల్లాపూర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో కూకట్‌పల్లి నుంచి అత్యధిక మెజార్టీతో లక్ష్మారెడ్డి గెలిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహాబేగం, అయిలయ్య, వీరారెడ్డి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమం కోసం పని చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ ఆధ్వర్యంలో డివిజన్ ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా ఆదివారం పాల్గొన్నారు. గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే తెలంగాణను ఎడారిగా మారుస్తోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ యూత్ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్‌చారి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును కేసీఆర్ విమర్శించడం సరికాదు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొడాలి రవికుమార్


రవికుమార్

హైదర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో పాటు పార్టీ ఖాళీ అవుతుండటంతో తీవ్ర అసహనంలో ఉన్న కేసీఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొడాలి రవికుమార్ అన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడిని కేసీఆర్ దూషించడాన్ని తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికారం కోల్పోయిన తర్వాత అసహనంతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఇది సరైనది కాదన్నారు. ఇప్పటికైన తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చందానగర్: మాజీ సీఎం చంద్రబాబుపై వరంగల్ సభలో కేసీఆర్ విమర్శించడాన్ని టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు రాజకీయ జీవితం టీడీపీ ఇచ్చిందని.. అలాంటి పార్టీ అధినేతను విమర్శించడం తగదని శేరిలింగంపల్లి టీడీపీ ఇన్‌చార్జి కట్టు వెంకటేష్‌గౌడ్ అన్నారు. కేసీఆర్ చంద్రబాబుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

● చంద్రబాబును కేసీఆర్ విమర్శించడం సరికాదని టీటీడీపీ రాష్ట్ర నాయకులు కుర్ర ధనలక్ష్మి అన్నారు. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్‌కు చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు.



పరికిచెరువు వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

పరికిచెరువును పరిరక్షించండి: సీపీఐ

జీడిమెట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురవుతున్న పరికి చెరువును పరిరక్షించాలని, చెరువులో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఐ నాయకులు ఉమామహేష్ డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్ట ప్రాంతంలోని భూదేవి హిల్స్ సమీపంలో కబ్జాకు గురవుతున్న పరికిచెరువు వద్ద చెరువుల సంరక్షణ సమితి నేతృత్వంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట ప్రాంతంలో 112 ఎకరాల పరికి చెరువును కబ్జాదారులు అమాయకులకు విక్రయిస్తూ నాలుగు వైపులా కబ్జాచేస్తూ వస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సాయిపంతులు, హరినాథ్, శ్రీనివాస్, సదానంద్, సహదేవరెడ్డి, వెంకటేష్, ఇమామ్, శివ పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యులు, ఎన్‌జీవో ప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

జీడిమెట్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. మెడ్‌విజన్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో సుభాష్‌నగర్ ఎస్సీ కో-ఆపరేటివ్ సొసైటీలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సురేష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శివాజీ, వాసురెడ్డి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎన్‌జీవో సంస్థ యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీకాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జెన్ ఆసుపత్రి, జెన్ డెంటల్ కేర్ పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు దంత సంబంధిత పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో వైద్యులు జి.వి.చాణక్య, ఆనంద్, శ్రీధర్‌రెడ్డి, స్మిత, పర్యవేక్షకులు గోనెపూడి వెంకటకృష్ణారావు, దివ్య, కావ్య పాల్గొన్నారు.


కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు

కుత్బుల్లాపూర్ అభివృద్ధే లక్ష్యం: కూన

గాజులరామారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ అభివృద్ధే తన లక్ష్యమని, 27 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి సేవ చేశానని, తిరిగి కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శ్రీశైలంగౌడ్ పార్టీలో చేరిన సందర్భంగా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు గాజులరామారంలోని పార్టీ కార్యాలయంలో శ్రీశైలంగౌడ్‌ను ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి ఎంపీగా సునితామహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు గుంజే శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, చాంద్‌పాషా, జహంగీర్, లాల్‌మహ్మద్, యాదిరెడ్డి, పరశురాం, పండరీజేమ్స్, దేవకర్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలి


పనులను పర్యవేక్షిస్తున్న ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ మెయిన్‌రోడ్డులో హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న వాటర్ మెయిన్ పైప్‌లైన్ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ సాయిరామ్‌తో కలిసి ఆదివారం పైప్‌లైన్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మ్యాన్‌లు నర్సింహారెడ్డి, మేకల బాలకృష్ణ, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.


నృత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కూచిపూడి నృత్య పోటీలకు స్పందన

వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ మయూరి నృత్యాలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వివేకానందనగర్ అపార్ట్‌మెంట్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో కూచిపూడి నృత్య పోటీలు ఆదివారం నిర్వహించారు. వివిధ గ్రూపులకు చెందిన విద్యార్థినులు ఈ పోటీలో పాల్గొన్నారు. అదేవిధంగా మ్యూజిక్ పోటీలు సైతం నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో నాట్యకిన్నెర నందిత, కార్యక్రమ పర్యవేక్షకులు ఆర్ఎస్ఎస్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం: ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కేపీహెచ్‌బీకాలనీలోని మై హెల్త్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుత తలెత్తే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు శారీరక శ్రమను అలవర్చుకోవాలని ఆసుపత్రి నిర్వాహకులు డా.చైతన్య కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వైద్యులు కిరణ్, శ్రీనివాసులు, జయంత్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, అన్వేష్‌చౌదరి, బాస్కర్‌రావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన చికెన్ రేట్లు

- లైవ్‌బర్డ్ రూ.220
- స్కిన్‌లెస్ కిలో రూ. 320
- నాటుకోడి కిలో రూ.400పైనే..
- కృత్రిమ కొరత సృష్టించి దోచుకుంటున్న వైనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ రేట్లు మళ్లీ దడ పుట్టిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకు కాస్త అందుబాటులోకి వచ్చిన ధరలు.. ఆదివారం ఒక్కసారిగా పెరిగాయి. కిలోపై రూ.80 నుంచి రూ.100 వరకు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు వెనకంజ వేశారు. గ్రేటర్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా చికెన్ రేట్లు గరిష్ఠంగా పెరిగాయి.

తగ్గినట్లే తగ్గి..!

మార్చి మూడో వారంలో నగరానికి కోళ్ల దిగుమతి పెరగడంతో రేట్లు కాస్తా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మార్చి 17 నుంచి ఏప్రిల్ 2 వరకు లైవ్‌కోడి కిలో రూ.120 నుంచి రూ.140 వరకు, స్కిన్‌లెస్ కిలో రూ.180 నుంచి రూ.200-220 వరకు విక్రయించారు. అయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయని భావిస్తున్న తరుణంలో రెండు రోజులుగా మళ్లీ పెంచారు. ఆదివారం స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు, లైవ్‌బర్డ్ రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయించారు. అలాగే నాటుకోడి కిలో బర్డ్‌ను రూ.400పైగానే అమ్మారు.

ఎండలను అడ్డుపెట్టుకుని దోపిడీ..

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి కోళ్ల దిగుమతి ఎక్కువగా ఉన్నప్పటికీ కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి అందిన కాడికి దోచుకుంటున్నారని చెబుతున్నారు. స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు రేటు పెట్టడం దారుణమని, దీనికంటే రూ.400 పెడితే మటన్ వస్తోందని పేర్కొంటున్నారు. ధరలను నియంత్రణపై ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'రత్నదీప్'లో అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు
- నగర శివారులో ఘటన


మార్కెట్‌లో ఎగిసిపడుతున్న మంటలు

నార్సింగ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో త్వరలో ప్రారంభం కానున్న ఓ సూపర్ మార్కెట్ కాలిబూడిదైంది. ఈ ఘటన బండ్లగూడ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్-అప్పా రేడియల్ మార్గంలో ప్రధాన రోడ్డుకు అనుకుని రత్నదీప్ సెలెక్ట్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభం కావాల్సిన మార్కెట్‌లో సెంట్రల్ ఏసీతో పాటు అన్ని రకాల ఎలక్ట్రికల్ పరికరాల ఏర్పాటు జరుగుతోంది. ఆదివారం సామగ్రి ఏర్పాటు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగిందని, మంటలకు దట్టమైన పొగ అలుముకోవడంతో అందరం ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టామని కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరూ గాయపడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లోనే ఉంటుందని, ఈ ప్రమాదానికి వెల్డింగ్ పనులు కారణమా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



● ఇఫ్తార్ విందు

కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్ఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి, ఆంధ్రజ్యోతి

ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌ను పొడిచి.. దోపిడీ

ముగ్గురిని అరెస్ట్ చేసిన మీర్‌చౌక్ పోలీసులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ జహంగీర్

హైదరాబాద్ సిటీ/ చార్మినార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆటోలో నిద్రిస్తున్న ఆటోడ్రైవర్‌పై దాడిచేసి, నగదు, సెల్‌ఫోన్ దోచుకున్న ముగ్గురు నేరస్తులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. పురానీహవేలిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్‌జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్ వివరాలు వెల్లడించారు. దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులు పాత నేరస్థులని, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో వారిపై కేసులున్నాయని తెలిపారు. కిషన్‌బాగ్‌కు చెందిన ఆటోడ్రైవర్ సయ్యద్ అబ్దుల్ హసన్ (35) పాత నేరస్తుడు. ఇతడిపై నగరంలో పలు పోలీస్‌స్టేషన్‌లలో 17 కేసులున్నాయి. యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ తాలిబ్‌అలీ అలియాస్ సమీర్(22) ప్రైవేటు ఉద్యోగి, ఇతడిపై కూడా పలు పోలీస్‌స్టేషన్‌లలో 7 కేసులున్నాయి. బాల్‌షెతికేత్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ తాహెర్ అలీ(30) స్నేహితులు. ఈనెల 5వ తేదీ తెల్లవారు జామున తాహెర్ అలీ, సమీర్, హసన్ ముగ్గురు ఆటోలో సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో వెళుతున్నారు. మాతాకిడికి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ దస్తగిరి (35) ఈనెల 5వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో సాలార్‌జంగ్ మ్యూజియం సమీపంలోని చిల్లా వద్ద రోడ్డుపక్కగా ఆటో ఆపి పడుకున్నాడు. వీరు ముగ్గురు ఆటోలో పడుకొని ఉన్న దస్తగిరి రెండు తొడలపై కత్తితో పొడిచి బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ. 500, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. బాధితుడు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట డీఐ దిలీప్‌కుమార్ బృందం సీసీ టీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కత్తులు, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

'కేజ్రీవాల్ అంటే మోదీకి భయం'

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. లోక్‌సభ ఎ న్నికల్లో ఓడిపోతానేమోనన్న భయంతోనే కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన జేబు సంస్థలుగా మార్చుకొని, ప్రతిపక్ష నేతలను బెదిరిస్తోందన్నారు. దర్యాప్తు సంస్థల సాయంతోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం ధర్నాచౌక్‌లో ఆప్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సుధాకర్ అధ్యక్షత వహించగా.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, బాలమల్లేశ్ పాల్గొన్నారు.


శ్రీలగార్డెన్ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

శ్రీలగార్డెన్ సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీలగార్డెన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మియాపూర్ శ్రీలగార్డెన్‌లో స్థానికులతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. యూజీడీ లైన్, పార్కు అభివృద్ధి, రోడ్ల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్రీలగార్డెన్‌లో పలు సమస్యలు పరిశీలించామని, పార్కులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న యూజీడీలైన్, పార్కు, సీసీరోడ్లు వంటి అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫణికుమార్, చంద్రికప్రసాద్, రాఘవరెడ్డి, ప్రవీణ్, శివ, కేశవ్‌ప్రసాద్, జశ్వంత్, మధు, కృష్ణారావు, లక్ష్మీపతి, సుమన్, జగదీశ్, విశ్వనాథ్, బుచ్చయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్, కృష్ణవేణినగర్, సాయిప్రశాంత్‌నగర్ ఫేజ్-2లో పాదయాత్ర చేసి స్థానికంగా ఉన్న పలు సమస్యలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, ప్రాధాన్యతా క్రమంలో కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న అపోలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి

రాయదుర్గం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికలంటే ఓ పండుగలా భావిస్తారని, చాలా పెద్దసంఖ్యలో వచ్చి తమ బాధ్యతగా గుర్తించి ఓట్లు వేస్తారని, అదే పట్టణాలు, నగరాల్లో మాత్రం పోలింగ్‌శాతం చూస్తే చాలా బాధగా అనిపిస్తోందని అపోలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. ఆదివారం నానక్‌రాంగూడలోని మైహోం విహంగ గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు తెలుసుకుని అవి అయ్యేలా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని అన్నారు. మనం ఓటువేస్తేనే మనకు ప్రశ్నించే హక్కుకూడా ఉంటుందన్నారు.

కొబ్బరికాయలు కోస్తుండగా విద్యుత్ షాక్
యువకుడి మృతి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కొబ్బరి చెట్టు నుంచి కొబ్బరికాయలు కోస్తుండగా యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ గ్రామం కర్మథానాకు చెందిన రాజ్‌కుమార్(20) బతుకుదెరువు కోసం నగర శివారులోని దూలపల్లిలో నివాసం ఉంటూ మయూర్ మడులూర్స్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం పరిశ్రమలో ఉన్న కొబ్బరి చెట్టుకు నిచ్చెన వేసుకొని కొబ్బరి కాయలు కోస్తుండగా విద్యుత్ వైర్లుకు కత్తి తగలడంతో కరెంట్ షాకు తగిలి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. కార్మికులు, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీరామ్‌నగర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

'శ్రీరామ్‌నగర్' కార్యవర్గం ఎన్నిక

గచ్చిబౌలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత గౌరవ అధ్యక్షుడు చాంద్‌పాషా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాము, జాయింట్ సెక్రటరీ నర్సింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ నారాయణమ్మ, వసంత, మనోజ్, గురుమూర్తి, మహేందర్‌సింగ్, ధనుంజయ, పుల్లయ్య, భాస్కర్‌రావు, రాజగోపాల్, పుల్లయ్య తదిరులను ఎన్నుకున్నారు.

భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణం

గచ్చిబౌలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నల్లగండ్లలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ పూజిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారాల ప్రధాన సలహాదారు నరేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, ఎంబీసీ డెవలప్‌మెంట్ చైర్మన్ జెరిపెటి జైపాల్, సోషల్‌మీడియా చైర్మన్ మన్నే సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్యాణంలో నరేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

పీఆర్‌సీ బాండ్స్ బకాయిల చెల్లింపుల్లో వివక్ష వద్దు

ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 2013 పీఆర్‌సీ బాండ్స్ బకాయిలను కేవలం 15 వేల మంది డ్రైవర్లకే చెల్లించి, కండక్టర్లు, ఇతర కార్మికులు, ఉద్యోగులకు నిలిపివేయడం అన్యాయమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో డ్రైవర్లతో పాటు కండక్టర్లు, ఇతర గ్యారేజీ కార్మికులు సైతం కృషి చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఆర్టీసీలో సుమారు 42 వేల మంది కార్మికులు దాచుకున్న బాండ్స్ డబ్బులను అందరికీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం 15 వేల మంది డ్రైవర్లకు అందించి, మిగిలిన 27 వేల మంది కార్మికులు (15 వేల మంది కండక్టర్లు, 4 వేల మంది గ్యారేజీ, 6 వేల మంది ఇతర సెక్యూరిటీ క్లరికల్, సూపర్‌వైజర్‌లు)ను విస్మరించడం దారుణమన్నారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ నాటికి 2013 నాటి పీఆర్‌సీ బకాయిలను పూర్తిస్థాయిలో ఆర్టీసీలోని కార్మికులందరికీ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లింపుల కోసం రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నిధులు, సబ్సిడీల చెల్లింపులు, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై యాజమాన్యం శ్వేత పత్రం విడుదల చేయాలని నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366